నేటి దినపత్రిక

# సూర్య

18 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం | 29 నవంబర్ 2024 | పేజీలు 8


## రామ్మూర్తి నాయుడుకు నివాళులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నారా రామ్మూర్తి నాయుడు దశదిన కర్మ నారావారిపల్లెలో గురువారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు.

## గద్దె రామ్మోహన్‌రావును కలిసిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావును వారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలం రెడ్డి దినేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



# మైనింగ్ అనుమతులతో.. ప్రాణాలకు ముప్పు



- పచ్చని పల్లె సీమలు.. చిచ్చు పెట్టకండి
- మా శవాలు దాటి.. కొండపైకి వెళ్ళండి
- తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :**

తెల్లరాయి తవ్వకాల చేపట్టడం వలన గ్రామాలే ఖాళీ అవ్వాల్సిన పరిస్థితి ఉందంటూ.. మండలంలోని జంగంరెడ్డిపల్లి, భాస్కరాపురం గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వరికుంటపాడు, భాస్కరపురం రెవెన్యూ పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో కొండపై తెల్లరాయి తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసనకు దిగారు. తెల్లరాయి తవ్వకాలు వద్దే వద్దు.. మా ప్రాణాలతో చెలగాటం ఆడద్దు.. 'సేవ్ జంగంరెడ్డిపల్లి.. సేవ్

-మిగతా 2లో



## పంటల బీమా

# పథకంలో చేరాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**



కలెక్టర్ ఆనంద్

జిల్లాలో పంటలను సాగు చేస్తున్న ప్రతి రైతు పంటల బీమా పథకంలో చేరవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో పంటల బీమా పథకంపై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పథకం ఉద్దేశాల గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్ వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో గుర్తించిన పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తుఫానులు,

-మిగతా 2లో



## దత్తత ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్




జిల్లాలో అనాధ పిల్లల దత్తత పక్రియలోజాప్యం జరగకుండా త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసు కోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. గురువారం నెల్లూరు కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలోని బాలల తో పని చేసే అన్ని శాఖల విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. - నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

## రీసర్వే గ్రామసభల దరఖాస్తులపై

# ప్రత్యేక దృష్టి సారించండి

### రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

రీసర్వే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సర్వేయర్లతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం తేడా రావడం వంటి పలు రీ సర్వే సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలు, గిరిజన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార

-మిగతా 2లో

# జ్యోతిరావు పూలే స్థానం చిరస్థాయిగా నిలిచిపోతుంది

## జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** భారతదేశ సామాజిక ఉద్యమ చరిత్రలో మహాత్మా జ్యోతిరావు పూలే స్థానం చిరస్థాయిగా నిలిచి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు, బాలికా విద్య కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ప్రతిఒక్కరూ కూడా పూలే అడుగుజాడల్లో పయనిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డిఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పూలేకు ఘన నివాళులు :**

స్థానిక బాలాజీనగర్ కూడలి సమీపంలోని పూలే విగ్రహానికి పలువురు బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేతలు పాల్గొని పూలేకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్, సూపరింటెండెంట్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

# సిమెంటు రోడ్ల నిర్మాణాలతోనే పల్లె ప్రగతి : చేవూరు జనార్ధన్ రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :**

సిమెంటు రోడ్ల నిర్మాణంతోనే పల్లెలు ప్రగతి పథంలో నడుస్తాయని మండల టిడిపి నాయకులు చేవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం సోమవరప్పాడు పంచాయతీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిమెంటు రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మంచి నీటి బోర్లను వేస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, నెల్లూరు పార్లమెంటు సభ్యుల వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల సహకారంతో జలదంకి మండలాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని ఆయన తెలిపారు.

# రీసర్వే గ్రామసభల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించండి

*(మొదటి పేజీ తరువాయి)*

వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎఫ్ లైన్ సర్వే, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు సర్వేయర్ లాగిన్‌లో పెండింగ్ ఉండకూడదన్నారు. చెరువుల ఆక్రమణల వివరాలను సేకరించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతిరోజూ కూడా రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలన్నారు. అన్ని అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేసి భూసమస్యల పరిష్కారానికి



కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్ రావు, నెల్లూరు ఆర్డీవో అనూష, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసిల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# మైనింగ్ అనుమతులతో ప్రాణాలకు ముప్పు

*(మొదటి పేజీ తరువాయి)*



పల్లెసీమలు..' అంటూ గ్రామ ప్రజలు ఏకమయ్యారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం కొండకు పోయే రహదారిలో చిన్న, పెద్ద అందరు కలిసి నిరసన తెలిపారు. 'వన విధ్వంసం.. జీవన విధ్వంసం' వద్దే వద్దు అంటూ నినదించారు ప్రజలు. వన్యప్రాణులు, వనాలకు ముప్పు కలిగించే తెల్లరాయి తవ్వకాలను చెప్పట్టవొద్దు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికుంటపాడు, భాస్కరపురం రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 233, 1లలో 16.92 హెక్టర్ల విస్తీర్ణంలో కొండ భూములు ఉన్నాయి. వరికుంటపాడు నుండి జంగంరెడ్డిపల్లి ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్లు దూరంలోనే ఉంది. ఈ కొండ భూముల్లో తెల్లరాయి నిక్షేపాలు ఉన్నట్లు గత వైసీపీ హయాంలో చేపట్టిన ప్రాథమిక సర్వేలో గుర్తించారు. ఈ విషయం తెలిసిన జంగంరెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఆగ్రహంతో రగలిపోతున్నారు. తెల్లరాయి తవ్వకాలు వద్దని వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. తెలరాయి తవ్వకాల కోసం కొండపైకి బోరు యంత్రాలు వెళ్లాల్సి వస్తే, తమ శవాలను దాటుకునే వెళ్లాలని పేర్కొన్నారు. తెల్లరాయి తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామంలో ఐదుగురు సభ్యులతో తెల్లరాయి వ్యతిరేక పోరాట వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తెల్లరాయి తవ్వకాలు మా గ్రామంలో జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## దత్తత ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో అనాధ పిల్లల దత్తత ప్రక్రియలోజాప్యం జరగకుండా త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసు కోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. గురువారం నెల్లూరు కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలోని బాలల తో పని చేసే అన్ని శాఖల విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న అన్ని అనాధ బాలల వసతి గృహాలు జెజె యాక్టు ప్రకారం 2015 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని, లేనిపక్షంలో వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహల్లో ఉన్న బాలలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డ్స్ లేని అనాధ పిల్లలకు విద్యాశాఖ, ఐటీడీఏ సహకారంతో ఆధార్ కార్డులు ఇప్పించాలన్నారు. భిక్షాటన చేసే కుటుంబాలను గుర్తించి వారికీ కౌన్సిలింగ్ ఇచ్చి వారి పిల్లలకు ఆధార్ కార్డ్స్ చేపించి స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. శిశు సంరక్షణ కేంద్రాలలో ఉన్న పిల్లలకు అన్ని సౌకర్యలు అందేలా చూడాలని తెలియజేశారు. బాలల సంరక్షణ కోసం పని చేస్తున్న విభాగాలన్నీ సమన్వయంతో పని చేయాలన్నారు. ఫ్యాక్టరీలలో బాలల పనిచేస్తున్నట్లయితే పకడ్బందీగా తనిఖీలు చేసి యాజమాన్యాలపై చర్యలు తీసు కోవాలన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ అధికారి హేనసుజున్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, డీఎస్పీ రామారావు, సీఐ కృష్ణారెడ్డి, కార్మిక శాఖ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా పథకంలో చేరాలి

*(మొదటి పేజీ తరువాయి)*

కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అదేవిధంగా వాతావరణ అంశాల ఆధారంగా కలిగే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించటం జరుగుతుందన్నారు. తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బీమా పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో వరి, మినుములు, శనగలు, పెసర, వేరుశనగ తదితర పంటలకు రైతు ప్రీమియం ఎకరాకు వరుసగా రూ.168, రూ.38, రూ.56, రూ.36, రూ.60 రూపాయలు మాత్రమేనని, ఆయా పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకునే రైతుల విషయంలో సంబంధిత బ్యాంకు ప్రీమియం మొత్తాన్ని మినహాయించి బీమా కంపెనీకి చెల్లిస్తారని, పంట రుణాలు తీసుకోని రైతులు తమ సమీప సచివాలయాలు, రైతు సేవ కేంద్రాలు, పోస్ట్ ఆఫీసులు, పీఏసీ ఎస్‌లలో ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. అలాగే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా నేరుగా మొబైల్ యాప్ ద్వారా నమోదు కావచ్చునన్నారు. ఇందుకోసం టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీను ఎంపిక చేసినట్లుగా తెలిపారు. రైతులు నమోదు చేసుకునేందుకు వరి పంట కోసం డిసెంబర్ 31వ తేది, మిగిలిన పంటలకు డిసెంబర్ 15వ తేదీ చివరి తేదీగా నిర్ణయించినందున వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా పంటల బీమా పత్రం కరపత్రాన్ని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖధికారి సుబ్బారెడ్డి, సిపిఓ రాజు, ఇరిగేషన్ ఎస్ఇ దేశ్ నాయక్, ఇన్సూరెన్స్ కంపెనీ, బ్యాంకు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్లపల్లిలో నేత్రదానం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన రావుల సంపూర్ణమ్మ (85) నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు గురువారం దానం చేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. రావుల సంపూర్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె చివరి కోరిక మేరకు నేత్రాలను మనసేవా సంస్థ సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నేత్రాను ఐ టెక్నీషియన్ వేణు సేకరించారు.

# ఆత్మకూరులో తప్పిపోయిన బాలిక సురక్షితం

## కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న షేక్ షంషీద్(13) అనే విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం నుండి కానరాకుండా పోయింది. ఈమేరకు ఆ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక డీఎస్పీ కె.వేణుగోపాల్ పర్యవేక్షణలో సిఐ గంగాధరం ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ జిలానీ తదితరులు ప్రత్యేక దృష్టి సారించారు. నాలుగు బృందాలుగా నెల్లూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి 24గంటలు తిరగకముందే ఉదయగిరిలో ఆ బాలికను గుర్తించారు. వెంటనే ఆత్మకూరుకు తరలించి గురువారం ఉదయం ఆ బాలికను తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. షంషీద్ తల్లి కరోనాసమయంలో మృతిచెందగా తండ్రి కూడా దూరం కావడంతో మేనమామ ఖాదర్‌బాషా వద్ద ఉంటుంది. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయిని మందలించడంతో మనస్థాపానికి గురైన ఆ బాలిక అక్కడనుండి ఎటో వెళ్ళిపోయింది. ఆమె కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు ప్రత్యేక శ్రద్ధతో పట్టుదలగా గాలింపు చర్యలు చేపట్టడంతో 24గంటల్లోగానే సురక్షితంగా ఆత్మకూరుకు చేరుకొని కుటుంబ సభ్యుల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక డిఎస్‌పి వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థిని తప్పిపోవడం, ఫిర్యాదు, తమ సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ జిలానీ, మర్రిపాడు ఎస్ఐ తదితరులు నాలుగుబృందాలుగా 24గంటల్లోగానే ఆబాలికను గుర్తించి సురక్షితంగా తీసుకురాగా ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ప్రత్యేక శ్రద్ధతో శ్రమతో గాలింపు చర్యలు చేపట్టి బాలికను స్వల్పవ్యవధిలో కుటుంబ సభ్యులకు చేర్చిన సిఐ, ఎస్ఐ, సిబ్బందికి డిఎస్‌పి అభినందించారు.

# జెనసేన ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



**నెల్లూరు నగరం, మేజర్‌న్యూస్ :** మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా జనసేన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల మినీ బైపాస్ వద్ద గల జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక సమానత్వానికి పూలే గారి పోరాటం ఆదర్శనీయం. జ్యోతిరావు పూలే భారతదేశంలో అణచివేత, అంటరానితనం, సామాజిక రుగ్మతలపై పోరాటాలు చేసిన తొలి యోధులలో ఒకరుగా నిలిచారు. అణగారిన వర్గాల పట్ల ఆయన చూపిన ప్రేమాభిమానాలు, వారిని సమాజంలో గౌరవప్రదమైన స్థితికి చేర్చేందుకు చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయంగా ఉంటుంది. కుల ఆధిపత్యం తీవ్రంగా ఉన్న కాలంలో ఆయన ధైర్యంగా ప్రతిఘటించి, సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, ఐకమత్యం అందించాలనే సంకల్పంతో పనిచేశారు. మహిళా విద్యకు పూలే దంపతుల మార్గదర్శకత చాలా గొప్పది. ఆడబిడ్డలకు చదువు ఎంతో ముఖ్యమని నమ్మి, వారి విద్యాభివృద్ధి కోసం జ్యోతిరావు పూలే తన సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించారు. ఈ పాఠశాల భారతదేశంలో మహిళా విద్యకు నూతన దిశ చూపించింది. మహిళల విద్యాభివృద్ధి కోసం పూలే దంపతులు చేసిన త్యాగం, కృషి చరిత్రలో చిరస్మరణీయం. వితంతువుల సంక్షేమానికి పూలే కృషి అభినందనీయం. జ్యోతిరావు పూలే వితంతువుల బిడ్డలు అనాథలుగా మారకుండా వారికి ఆశ్రయం కల్పించడమే తన కర్తవ్యంగా భావించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించి, వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపిన మార్గదర్శిగా నిలిచారు. సతీసహగమనం వంటి అన్యాయపు ఆచారాలను నిర్మూలించి, వితంతువుల పునరావాసం కోసం ప్రత్యేక గృహాలను కూడా స్థాపించారు. జనసేన లక్ష్యాలకు పూలే ప్రేరణ. జనసేన పార్టీ మూల సిద్ధాంతాలలో ఒకటైన 'కులాలను కలిపే ఆలోచనా విధానం' జ్యోతిరావు పూలే గారి ఆలోచనలకు సమీపంగా ఉంటుంది. ఆయన కులవ్యవస్థను అణగదొక్కి సమానత్వం కోసం పోరాడిన గొప్ప మార్గదర్శి. ఆయన చూపిన దారిలో నడుస్తూ జనసేన పార్టీ కుల, వర్గ భేదాలను అధిగమించి సమాజంలో ఐకమత్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తోంది. మౌలిక వసతుల కోసం ఎన్డీయే కూటమి కృషి. స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తయినా, కొన్ని వర్గాలకు కనీస మౌలిక వసతులు అందకపోవడం బాధాకరం. జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రేరణగా తీసుకుని, అలాంటి వెనుకబడిన వర్గాలకు మౌలిక వసతులు సమకూర్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంకితభావంతో పనిచేస్తున్నారు. పవన్‌కళ్యాణ్ నడక పూలే అడుగుజాడల్లోనే పవన్ కళ్యాణ్, జ్యోతిరావు పూలే, ఆశయాలను అనుసరించి సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి, సమానత్వం, సంక్షేమం కోసం శ్రమిస్తున్నారు. పూలే మార్గదర్శకతతో, న్యాయం, ఐకమత్యం, మరియు అభివృద్ధి కలిగిన ప్రగతిశీల దేశ నిర్మాణానికి ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందని గర్వంగా చెప్పుకుంటూ ఆ మహనీయునికి ఘననివాళులు అర్పిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, నగర కార్యదర్శి హేమచంద్ర యాదవ్, 13వ డివిజన్ ఇన్‌చార్జ్ పెనేటి శ్రీకాంత్, 4వ డివిజన్ ఇన్‌చార్జ్ మనోజ్, ముత్తుకూరు మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, బన్నీ, యాసీన్, షేక్ షబ్బీర్, ఫిరోజ్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు లక్షలు దొంగతనం చేసిన ముద్దాయి అరెస్టు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** 6లక్షల రూపాయలు దొంగతనం చేసిన నేరస్తుడిని చాకచక్యంగా కృష్ణపట్నం సర్కిల్ పోలీస్ యంత్రాంగం పట్టుకుంది. గురువారం సాయంత్రం సీఐ రవి నాయక్, ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టు ఎస్ఐలు పి.విశ్వనాథరెడ్డి, జేపీ శ్రీనివాస రెడ్డిలతో మీడియా సమావేశం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేసు వివరాలు సీఐ తెలియజేశారు. పిడతా పోలూరు గ్రామపంచాయతీ కట్ట కింద వడ్డీ పాలెం గ్రామానికి చెందిన నెల్లూరు పద్మ ఇంట్లో అదే గ్రామానికి చెందిన నెల్లూరు వెంకట రమణయ్య మూడు రోజుల క్రితం ఆరు లక్షల రూపాయలు దొంగతనం చేసినట్లు సీఐ తెలిపారు. అప్పు కోసం వెళ్లి ఇంట్లో ఉన్న డబ్బు చూసి ఈ దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు నెల్లూరు వెంకట రమణయ్య బానిసైనట్లు సీఐ మీడియాకు తెలియజేశారు. పిడతా పోలూరు క్రాస్ రోడ్డు వద్ద ముద్దాయిని అరెస్ట్ చేసినట్లు సీఐ అన్నారు. ముద్దాయి నుంచి ఆరు లక్షల రూపాయలు నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును చేదించినందుకు ఇద్దరు ఎస్ఐలను, సిబ్బందిని అభినందించారు.

## అత్యధికంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామంలో నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మంది పాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ.. గురువారం నార్త్ రాజుపాలెం గ్రామంలో నిమ్మ తోట పరిధిలో 700 సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి అనివార్య కారణాల వలన చనిపోతే మట్టి ఖర్చుకి పదివేల రూపాయలు ప్రమాద బీమా కింద ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్క కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, పాటూరు రమేష్, ఇరువురు యోగానంద రెడ్డి, పోసిం రెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, మయూరి సిద్ధార్థ, బాబి, మురళి, నాసిన ప్రసాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఆర్‌టి సెంటర్ పనితీరు పరిశీలన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏపీఎస్‌ఆర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని ఏఆర్‌టి సెంటర్‌ను డిఎల్ఏటిఓ ఎస్.కె ఖాదరవల్లి గురువారం పరిశీలించారు. అనంతరం ఏఆర్‌టి విభాగము నందు జరిగిన సమన్వయ సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. ఏఆర్‌టీ సెంటర్ పనితీరుని పరిశీలించి వారికీ తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, ఏఆర్‌టి మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## అర్హులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం సిద్దనపాలేం గ్రామానికి చెందిన కొనసం సుదర్శన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును 2,82,781 కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గురువారం ఆయన కార్యాలయంలో అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర రావు, బోగోలు తెలుగు యువత అధ్యక్షుడు అన్నంగి ఆదిశేషయ్య, కాకి తిరిపతి, రామలింగం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

### టీటీడీ చైర్మన్‌ను కలిసిన తెలుగు యువత ఉపాధ్యక్షులు శ్రీనాథ్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ పాలకమండలి చైర్మన్ బి.ఆర్ రాయుడును తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనాథ్ కోరారు. గురువారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు చెప్పామని ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. చైర్మన్‌గా నియామకం అయిన సందర్భంగా కలిసినట్లు తెలిపారు.

# ఆటల పోటీలలో సత్తా చాటిన నెల్లూరు విద్యార్థులు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఈనెల 26, 27 తేదీలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల, కావలిలో నిర్వహించిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఇంటర్ కాలేజియేట్ పురుషుల ఆటల పోటీల్లో, యూనివర్సిటీ విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరచి, తగ్ ఆఫ్ వార్ విభాగంలో మొదటి స్థానం, బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో ద్వితీయ స్థానం, యోగా విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సి. హెచ్.వెంకట్ రాయులు విజేతలను హృదయపూర్వకంగా అభినందించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర రావు మాట్లాడుతూ.. విద్యార్థుల క్రీడా రంగంలో సాధించిన విజయాలు విశ్వవిద్యాలయ గౌరవాన్ని మరింతగా పెంచాయి. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనం, కఠిన శ్రమను పెంపొందిస్తాయి. విద్యార్థుల ఈ ప్రతిభా ప్రదర్శన గర్వకారణం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు అవసరమైన అన్ని విధాల ప్రోత్సాహం అందించేందుకు విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సి.హెచ్. వెంకట్ రాయులు, విజేతల కృషిని ప్రశంసిస్తూ, "విద్యార్థుల క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి. ఇది నిశ్చయంగా వారి కఠిన శ్రమకు, కోచ్‌ల మద్దతుకు, విశ్వవిద్యాలయం అందించిన అవకాశాలకు ప్రతిఫలం" అని అన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతికి ఘన నివాళి



## పొదలకూరు మండల బీసీ సంక్షేమ సంఘం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని బీసీ సంక్షేమ సంఘం ఆయనకు ఘన నివాళులు అర్పించారు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ఊకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు, పమిజల శంకరయ్య చొప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘానికి సేవకుడెట్కన జ్యోతీరావ్ గోవిందరావ్ పులే మహారాష్ట్రలోని సతరా జిల్లాలోని వ్యవసాయ తోట మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడని, ఒక భారతీయ సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త, మహారాష్ట్రకు చెందిన రచయిత. అతను కులం పేరుతో తరతరాలుగా, అన్నిరకాలుగా అణచివేతకుగురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడని తెలియ జేశారు. భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కొట్లాది ప్రజానీకం కోసం, పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడాడు. ఆయన అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు కృషి చేశాడు. 1873 సెప్టెంబరు 24న, ఫులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేశాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే.సిద్దయ్య రఘురామయ్య, పైడాకుల సుధాకర్, కోడూరు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కబడ్డీ పోటీలు : సమాధి శ్రీనివాసులు యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పప్పులు వీధిలో గల వైవీఎం స్కూల్ నందు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. గెలిచిన టీములకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సమాధి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ లలితారాం యాదవ్, అఖిల భారత పద్మశాలి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు రామనాథం రాజశేఖర్, జిల్లా బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి బుధ వారపు బాలాజీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులు పవన్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వారి యొక్క సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ప్రతి సంవత్సరం విద్యార్థులతో ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారి యొక్క శారీరకంగా మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటారని ఆయన అన్నారు. నేటి నేటి బాలలే రేపటి పౌరులని వారు సమాజం యందు బాధ్యతగా మెలిగేదానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని భవిష్యత్తులో వారు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసే దానికి ఇక్కడే పునాది పడుతుందని ఈ సందర్భంగా సమాధి శ్రీనివాసులు యాదవ్ తెలియజేశారు.

## నిబంధనలను తుంగలో తొక్కుతున్న
# మద్యం దుకాణదారులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం నాగులవరం గ్రామంలో ఉన్న మద్యం దుకాణం ఆవరణలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా నడిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సిమెంట్ రోడ్ల నిర్మాణంకు శంకుస్థాపన



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం మేజర్ పంచాయితీ పరిధిలోని బేతనీయ పేటలో గురువారం బోగోలు పంచాయితీ ఇంచార్జ్ ముంతాల వెంకయ్య సిమెంట్ రోడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బెతనీయ పేటకు 210 మీటర్ల గాను సుమారు 7 లక్షల నలభై వేల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోచిపాతల సంజయ్, శ్యాంసుందర్, గుంట గాని రాజా, సుభాని, వినోద్, బంక ఫిలిప్, అనిల్, జయానందం, విజయ్ ఫిలోమాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో ఉన్న ఎన్టిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అపోలో హాస్పటల్ సౌజన్యంతో కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, రక్తం యొక్క గ్రూపులను చక్కెర పరీక్షలను నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు అపోలో హాస్పిటల్స్ డాక్టర్స్ తగు సూచనలు చేసి మందులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనంజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయమ్మ, అపోలో టెలి నెట్వర్కింగ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శం : శేషం.సుదర్శన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో తొలి సామాజిక విప్లవ ఉద్యమకారుడు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన మహాత్మా జ్యోతి రావ్ పూలే 134వ వర్ధంతి సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం.సుదర్శన్ నెల్లూరు బాలాజీ నగర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శేషం సుదర్శన్ మాట్లాడుతూ.. అంటరానితనం, కుల నిర్మూలన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. మహిళలకు బడుగు బలహీన వర్గాల వారికి విద్యను అందించేందుకు పాఠశాలలను స్థాపించి,తన భార్యను చదివించి టీచరుగా తయారుచేసి చదువు చెప్పారని, సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించారని అన్నారు. నేడు మనమందరం ఆయనను ఆదర్శంగా తీసుకొని పనిచేసి ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రవి,సురేష్,రామకృష్ణ,నరేష్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి సభ



**కలువాయి, మేజర్‌న్యూస్ :** భారతదేశ మొట్టమొదటి సామాజిక విద్యా విప్లవ కారుడు మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని అంబేద్కర్ ధర్మ పోరాట సమితి కలువాయి మండల శాఖ ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ దరప ధర్మ పోరాట సమితిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ మాట్లాడుతూ.. కానీస మానవ హక్కులు లేకుండా జీవిస్తున్న సూద్రులు, అతిశూద్రులకు పాఠశాలలు స్థాపించి, మహిళలు చదువుకుంటే దేశానికి వెలుగవుతారని భావించి తన భార్య సావిత్రిబాయి పూలేను మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా చేసిన గొప్ప సంఘసంస్కర్త, ధర్మశాస్త్రాలు, వేదాలు, పురాణాలు యొక్క వాస్తవికతను ప్రశ్నించి బ్రాహ్మణిజానికి సవాలు విసిరిన గొప్ప హేతువాది, పూనా పట్టణ ంలో లక్షల మంది చేత మహాత్మా అని గౌరవింపబడిన ఈ దేశపు నిజమైన ఏకైక మహాత్ముడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి నాయకులు గొల్లపల్లి నరసయ్య, చింతా రవి, దొరబాబు, దర్శి పెంచలయ్య, బోయిల్ల బాబు, గొల్లపల్లి నరసింహులు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా చేద్దాం

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో వరకు కిశోరి వికాసం-2.0 స్థాయిలో శిక్షకుల శిక్షణా కార్యక్రమం ద్వార అవగాహన పెంచుకొని పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కిశోరి వికాసం-2.0 కిశోరి బాలికా స్వేచ్ఛా సంపూర్ణ సాధికారిత కోసం సంబంధించిన గోడ పత్రికను కలెక్టర్ ఆనంద్ సంబంధించిత అధికారులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధికారులు కిశోరి వికాసం శిక్షకుల శిక్షణ కార్యక్రమం ద్వారా జిల్లాస్థాయి శిక్షణ అందించడానికి నియమించిన టీమ్ సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకొని పూర్తిస్థాయిలో అవగాహన కలిగి తద్వారా మండల, గ్రామస్థాయి సభ్యులకు శిక్షణ ఇచ్చి కిషోర్ వికాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధచూపడం తోపాటు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు వాటినుండి బాలికలు ఎదుర్కొనే మార్గాలు గురించి అవగాహన కల్పిస్తారని, బాల్యవివాహాల నివారణ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాల్య వివాహాలు జరగడం వలన ఆడపిల్లలు భవిష్యత్‌లో ఎదుర్కొనే సమస్యలు గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. గ్రామాల్లో అంగన్వాడీ వర్కర్లు, సూపర్ వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు బాల్యవివాహాల జరిగే సమాచారాన్ని సంబంధిత అధికారులకు, టోల్ ఫ్రీ నెం.1098కు చేరవేయాలని చెప్పారు. బాల్యవివాహాల చట్టం ప్రకారం 18 సంవత్స రాలలోపు వారికి బాల్య వివాహాలు నిషేధమని అన్నారు. బాలికలకు విద్య, న్యూట్రిషన్, ఐరన్ లోపం, ఆరోగ్యం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యోగా, ఫిట్ నెస్ తదితర అంశాలపై శిక్షణ లో ఉన్న ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హేనసుజున్ జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెంచలయ్య, ఉమెన్ పోలీసుస్టేషన్ డీఎస్పీ రామారావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ.కృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు

## నివాళులర్పించిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈరోజు 134వ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మినీ బైపాస్ రోడ్‌లోని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించడం జరిగినది ఇందులో బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పలమాల శ్రీహరి రావు, జిల్లా అధ్యక్షులు మాల్యాద్రి, జనరల్ సెక్రెటరీ ముంగర శైలజ మహిళా అధ్యక్షురాలు రాము గౌడ్ ఉపాధ్యక్షురాలు ఎస్కే సలీం ఉపాధ్యక్షులు ముఖ్యఅతిథి పూలే విగ్రహ సృష్టికర్త శ్రీ దేవరాల సుబ్రహ్మణ్యం పూలే విగ్రహ ప్రతిష్టకు కృషి చేసినటువంటి ఆరంభాకం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ.. పోగొట్టుకున్న హక్కులు పోరాడకుండా రావు అని ధైర్యంగా చెప్పిన మన మహాత్మ, బడుగు బలహీన వర్గాలకు భరోసానిచ్చి, అన్యాయాన్ని ఎదిరించేలా, అక్రమాలను ఎదురు తిరిగేలా, ఆత్మగౌరవంతో జీవించేలా మనుషులుగా బ్రతికేలా నేర్పరిచిన బడుగు బలహీన వర్గాల బ్రతుకులు బాగుపడే సంఘసంస్కర్త మన జ్యోతిరావు పూలే అని కొనియాడారు. అంటరానితనం.. స్త్రీలకు విద్య అందించాలని ఉద్దేశంతో తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మొదటిగా మహిళలకు పాఠశాలలు స్థాపించడం జరిగింది. బడుగు బలహీన వర్గాలకు అతను చేస్తున్న కృషిని చూసి ప్రజలే అతని మహాత్మా అని పిలవడం మన రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్యోతిరావు పూలేని గురువుగా భావించారని, గులాం గిరి అనే గ్రంథాన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి సమన్యాయం సమధర్మం కోసం పోరాడి సమ సమాజభివృద్ధికి కృషిచేసి 1890 నవంబర్ 28వ తేదీ తుది శ్వాస విడిచారు. విద్యావంతులు, మేధావులు, సంఘ నాయకులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు ఇప్పటికైనా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సలహాలు ఇవ్వాలని ఆయన ఆశయాలను చేకూరే విధంగా మన ప్రయత్నం చేయాలని సమాన హక్కుల కోసం బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేస్తూ రాజకీయంగా ఎదిగేందుకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరుకుంటూ అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరుకుంటున్నామన్నారు. రాజ్యాధికారమే అన్ని సమస్యలకు పరిష్కారమని బాబా సాహెబ్ అంబేద్కర్ తెలియజేశారు.

# కోటపాడు విద్యార్థుల సమస్య తీరేదెన్నటికో..



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరు మజరా కోటపాడు గ్రామ రహదారి అధ్వాన్న స్థితిపై అనేకదపాలు నిరసనలు, అర్జీల సమర్పణ, ధర్నాలు తదితరాలెన్ని చేసినా వారి సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదనచెందుతున్నారు. ఆత్మకూరు-నాగులపాడు రోడ్డునుండి కోటపాడుకు 2కిలోమీటర్ల రోడ్డు ఉండగా అనాదిగా ఆరోడ్డు అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఆగ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతినిత్యం ఆ రోడ్డుపై నడిచి మహిమలూరుకు, ఆటోల్లో ఆత్మకూరుకు చదువుకునేందుకు వెళుతుండగా నాలుగు చినుకులు పడినా బురదమయమై కాలుపెట్టలేని పరిస్థితి ఉంటుంది. రెండేళ్ళుగా ఆ గ్రామ విద్యార్థులు పలుదపాలుగా వర్షం సమయంలో బురదలో దిగి నిరసన తెలుపడం, ఆత్మకూరులోని తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రాలు అందించడం, నాయకులకు విన్నపాలు చేయడంతోపాటు గత సంవత్సరం అప్పటి కలెక్టర్ ఆత్మకూరుకు విచ్చేయగా కోటపాడు విద్యార్థులు వచ్చి నిరసన కార్యక్రమం నిర్వహించి తమ సమస్యతీవ్రతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అయితే కలెక్టర్ ఈరోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేశారని, అయితే పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదంటూ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, దాంతో ఈరోడ్డు సమస్య యధారాజాతధాప్రజ అన్నచందంగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. విద్యార్థులు ఈరోడ్డుబాగు కోసం, తమ అవస్థలు తప్పించుకునేందుకోసం అనేకవిధాలుగా పోరాటాలు చేసి అలసిపోయి ఆవేదనతో ఉన్నారు. మరి అధికారులు, పాలకులు ఈసమస్యను ప్రత్యేకంగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని మాజీ టీడీపీ మండల అధ్యక్షులు పిన్నిబోయిన సుధాకర్ రావు కార్యాలయంలో మహాత్మ జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అధ్యక్షులు వాసు, బి.తిరుపతి బిసి నాయకులు, మునయ్య తదితరులు కార్యక్రమం పాల్గొన్నారు.

## సైదాపురం జడ్పీ హైస్కూల్‌లో మెడికల్ క్యాంపు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సైదాపురం జడ్పీ హైస్కూల్ నందు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతి ఒక్క విద్యార్థికి రక్త పరీక్షలు చేసి వారికి ఉన్నటువంటి అనారోగ్య సమస్యలు తెలుసుకునేందుకు సైదాపురం జడ్పీ హైస్కూల్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్నటువంటి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వాసుదేవ్ కుమార్, పీడీ కోటేశ్వరరావు, సిహెచ్‌ఓ, సొరకాయల శెట్టి ఏఎన్ఎంలు శ్రీలత, గౌరీ పార్వతి ఆశ వర్కర్స్ నాగమణి అర్చనమ్మ ఇతరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కల్చర్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని గురువారం దర్శించుకున్న టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయ నకు ఆలయ లాంచనాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థానానికి మరింత ఆదాయం తీసుకువచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి అని ఆలయ అభివృద్ధికి సూచనలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓట్టూరు సురేంద్రయాదవ్ ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరికృష్ణ, పలువురు దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిరుత జాడ కోసం వేట



**రాపూరు, మేజర్‌న్యూస్ :** పెంచలకోనలో చిరుత సంచారం నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాపూరు అటవీ రేంజ్ అధికారి పందిళ్ల రవీంద్ర బాబు ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు చిరుత జాడ కోసం పెనుశిల అభయారణ్యంలో అటవీ అధికారులు జల్లెడ పడుతున్నారు. దుప్పులు అడవి పందులను వేటాడే క్రమంలోనే చిరుత రోడ్డుపైకి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. అభయారణ్యంలో పలుచోట్ల చిరుత పాదముద్రలను గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ రేంజ్ అధికారులు అది అడవిలోకి దూరంగా వెళ్లిపోయినట్లు ప్రజలు, భక్తులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చిరుత కలకలం రేపిన నేపథ్యం లోవన్యప్రాణులు, చిరుతలు కనిపించినప్పుడు వాటిపై కవ్వింపు చర్యలకు పాల్పడితేనే అవి దాడులు చేస్తాయి. కాబట్టి ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా శబ్దాలు చేస్తూ వెళ్లడం శ్రేయస్కరం అని సూచించారు. పెనుశిల అభయారణ్యం పరిధిలోకి వస్తున్నందున వన్యప్రాణులు, క్రూర మృగాల సంచారం సర్వసాధారణమని రేంజ్ అధికారి పందిళ్ల రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆయన వెంట ఆ శాఖ సిబ్బంది ఉన్నారు.

# పేరారెడ్డిపల్లి హైస్కూల్లో రాజ్యాంగదినోత్సవం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కరరెడ్డి పర్యవేక్షణలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావు ఆధ్వర్యంలో భారతరాజ్యాంగదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించగా గురువారం విజేతలకు బహుమతీప్రదానం గావించారు. భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగపీఠిక, రాజ్యాంగ ప్రతిజ్ఞలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావాలను అందరూ పంపొందించు కోవాలని కోరారు. డాక్టర్ అంబేద్కర్ ఎంతగానో శ్రమించి దేశంలోని అన్నివర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాయబడిన భారత రాజ్యాంగ గొప్పతనాన్ని గురించి వివరించారు. ఈపాఠశాల సాంఘిక ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావు రాజ్యాంగరూపశిల్పి జీవితచరిత్రను, రాజ్యాంగ దినోత్సవ, సోషల్‌డే ప్రాధాన్యతల గురించి వివరించారు. నాగరాజారావు ఆధ్వర్యంలో మాక్‌పార్లమెంట్ నిర్వహించగా అధికారపక్షసభ్యులు, మంత్రులు, ప్రతిపక్షసభ్యులు, ప్రశ్నలు, సమాధానాలు, స్పీకర్ తదితరాలన్ని అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం అంశంగా వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, ఉపన్యాసాలు తదితర పోటీలు నిర్వహించారు. గురువారం పాఠశాల



ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా సోషల్‌టీచర్ పార్లపల్లి నాగరాజారావు స్వంత నిధులతో సమకూర్చిన బహుమతులను 40మందికి సోమవరపు, ఉపాధ్యాయుల చేతులమీదుగా బహుమతీప్రధానం గావించారు. కార్యక్రమంలో పాల్గొన్న 25మంది విద్యార్థులకు పేనాలను కూడా నాగరాజారావు బహూకరించారు. అనంతరం విద్యార్థినిలచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.హెచ్.శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, రొట్టె వెంకటేశ్వర్లు, డి.మాల్యాద్రి, మహబూబ్‌ఖాన్, కె.సి.మస్తానయ్య, పి.డి.పి.సుమతి, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాకాణి అవినీతికి ఆనవాళ్లు గ్రావెల్ గనులు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం సర్వేపల్లి పంచాయతీ పరిధిలో అక్రమ గ్రావెల్ గుంటలను పరిశీలించిన సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడుసర్వేపల్లి నియోజకవర్గంలోని సర్వేపల్లి, ఈదగాలి పంచాయతీలలో అనుమతులు లేకుండా అక్రమంగా పేదలకు ఇచ్చిన భూములను అతి తక్కువ ధరకు తీసుకొని, భూములు ఇవ్వని వాళ్ళని బెదిరించి ఎకరాకు ఎంతో కొంత ఇచ్చి ఆ భూములలో కోట్ల రూపాయలు విలువ చేసే గ్రావెల్ ను 15 నుంచి 20 అడుగుల లోతు తవ్వకాలు జరిపి కోట్లు గడించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అండ్ టీం నేడు మీడియా ముందుకు వచ్చి సోమిరెడ్డి అవినీతి చేశాడని మీడియా సమావేశాలు పెడుతున్నావంటే నిన్ను ఏమని పిలవాలో అర్థం కావడం లేదు. కాకాణి అవినీతి చేసింది నువ్వు.. దోచుకున్నది నువ్వు.. నీ అనుచరులు, దానికి ఆనవాళ్ళు గ్రావెల్ గుంటలు మైనింగ్ గనులు త్వరలోనే నీ అవినీతి అక్రమాలను బయటపెట్టి నిన్ను కూటమి ప్రభుత్వం జైలుకు పంపడం ఖాయం గుర్తుపెట్టుకో కాకాణి అని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో పినిశెట్టి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య రామిరెడ్డి, మణి, తెలుగుదేశం పార్టీ నాయకులుబద్వేల్ ఏడుకొండలు, దూడల రాము, బద్వేల్ చిరంజీవి, ఎందోటి నారాయణ, ఏందోటి వెంకటేశ్వర్లు, పెంచలయ్య, తుమ్మతాటి తిరుపాలు, బీజేపీ నాయకులు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెప్మామార్కెటింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## కమీషనర్, తుమ్మల ప్రారంభం : టీఎంసీ మాధవి ఆధ్వర్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెప్మా ఆధ్వర్యంలో స్వయంసహాయకసంఘాల మహిళలు తయారుచేసి విక్రయానికి పెట్టిన అర్బన్‌మార్కెటింగ్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని అన్నాక్యాంటిన్‌సమీపంలో మెప్మా టిఎంసి జి.మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెటింగ్ కేంద్రాన్ని కమీషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డిలు ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారుచేసిన వివిద రకాల బ్యాగులు, రెడిమేడ్ దుస్తులు, ఊరగాయలు, వివిదరకాల తినుబండారాలను ఈ మార్కెటింగ్ కేంద్రంలో విక్రయానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వస్తువులను నెలకు 2రోజులు వంతున విక్రయానికి ఉంచుతున్నారన్నారు. కాగా ఈ మార్కెటింగ్ కేంద్రాన్ని ప్రతినిత్యం నిర్వహించేలా తమకు స్థలం కేటాయించాలని మెప్మా టిఎంసి మాధవి కోరిందని, ఆమేరకు మున్సిపల్ కార్యాలయం ముంగట కేటాయించేలా రానున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు తయారుచేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారని, అందరూ వాటిని కొనుగోలు చేసి ఆ మహిళల ఉపాధికి దోహదపడాలని కమీషనర్ కోరారు. పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ప్రసంగిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వతహాగా





తమ మేధస్సుతో తయారుచేస్తున్న వస్తువులను విక్రుకయించుకునేలా మార్కెటింగ్ కేంద్రం ఏర్పాటు సంతోషదాయకమని, వారు నిరంతరం ఈ కేంద్రాన్ని కొనసాగించుకునేందుకు తమవంతుగా కృషిచేస్తామని పేర్కొన్నారు. మహిళలు స్వయంఉపాధికోసం ఈ విధంగా ప్రత్యేకతరహా వస్తువులను రూపొందించి మార్కెటింగ్ చేయడం శుభపరిణామమని, అందుకు తమవంతుగా సంపూర్ణసహకారమందిస్తామని కూడా చంద్రారెడ్డి పేర్కొన్నారు. మెప్మా టిఎంసి మాధవి మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్యలోని వివిద ప్రాంతాల మహిళలు స్వయం ఉపాధికోసం బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించామని, దాంతో వారు తమ ఇళ్ళవద్దనే కుటీర పరిశ్రమలాగా వివిద రకాల వస్తువులను తయారు చేస్తున్నారన్నారు. వాటిని విక్రయించేందుకు మార్కెటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ప్రతినిత్యం ఈ కేంద్రం కొనసాగించేలా ప్రయత్నిస్తామని మాధవి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల మణిచందన తదితరులు వివిద రకాల వస్తువులను కొనుగోలు చేయగా మెప్మా ఆర్‌పిలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు పముజుల ప్రదీప్ చేనేత నాయకులు ఆశం సురేష్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి వారి విద్య అభివృద్ధికి జ్యోతిరావు పూలే కృషి చేశారని, ఆయన గొప్ప సంఘసంస్కర్త అని, మానవతావాది అని కొనియాడారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు బలహీన వర్గాలకు చట్టసభలలో, స్థానిక సంస్థలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగినేని రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలో పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా వుంచుకునేందుకు గ్రామస్థాయి అధికారులు, ప్రజలు కృషిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డి.రామకృష్ణరావు పేర్కొన్నారు. ఆయన గురువారం తనకార్యాలయంలో మండలంలోని సచివాలయ ఇంజనీరింగ్ సమాయకులు, ఏఈతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. మరుగుదొడ్ల వినియోగ ఉపయోగాలను ప్రజలకు వివరించాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకోలేని, పేదలు ఎక్కువగావున్న ప్రాంతాల్లో ప్రభుత్వం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నదన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ నిర్మాణపనులకు గ్రౌండిగ్ చాలా తక్కువగావుందన్నారు. ఇప్పటి వరకు చేసిన నిర్మాణాలకు 2,3 రోజుల్లో బిల్లులనగదు జమఅవుతుందన్నారు. గుత్తేదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు.

## భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కొండాయపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వరాబాదు గ్రామం వద్ద గల సర్వే నంబరు 740 భూమిలో గురువారం వీఆర్వో మాలకొండయ్య హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. 10.54 విస్తీర్ణంతో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న ఆ భూమిని సాగు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు వీఆర్వో తెలిపారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి జలవనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలో డిసెంబర్ 8వతేదిన జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ చంద్రమౌళి పేర్కొన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలోని సీతారాంపురం మండలంలో 6చెరువులకు, ఉదయగిరి మండలంలో 11 చెరువులకు, గండిపాళెం జలాశయ పరిధిలోని 17 డిస్ట్రీబ్యూటరీలు మొత్తం 34 సాగునీటి సంఘాలకు ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితాలు సిద్ధంచేశామని, 34పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. వచ్చేనెల 5న నోటిఫికేషన్ విడుదలచేస్తామన్నారు. ఆయకట్టు పరిధిలో పేరుపుండి ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. పోటిచేసి అభ్యర్థులు నీటి తీరువా బకాయిలు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికేట్ పొందుపర్చాలన్నారు. ఏకగ్రివ నీటి సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఎన్నికలు చేతులుఎత్తే పద్ధతిలో లేదాచీటీల పద్ధతిలో నిర్వహిస్తా రన్నారు. ప్రశాతంగా ఎన్నికలు జరిగేందుకు ఆయకట్టు రైతులు సహకరించాలన్నారు. ప్రతి సంఘానికి 6టీసీలు వుంటాయన్నారు. ఓటరుకు ఒకటీసీలో ఓటుహక్కు తప్పనిసరిగా కలిగివుం డాలన్నారు.

# భూ కబ్జాలతో చెలరేగిపోతున్న బ్రాందీ షాపు యజమాని

- టీడీపీ నాయకులు ఆగడాలకు అడ్డుకట్ట వేసేవారే లేరా.?
- ప్రభుత్వ స్థలాల్లో వెలుస్తున్న మద్యం దుకాణాలు
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- మద్యం దుకాణాలను తొలగించాలని ప్రజలు వేడుకోలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన సైదాపురంలోని పెద్ద చెరువు చెరువు పోరంబోకు ల్యాండ్‌ను కొంతమంది స్థానిక టీడీపీ నాయకుడు సురేంద్ర ద్వారా అక్కడ ఉన్నటువంటి పెద్ద చెరువు పోరంబోకు ల్యాండ్ కబ్జా జరిగిందని సైదాపురం సర్పంచ్ భర్త కోలా రమేష్ తెలియ జేశారు. స్థానిక టిడిపి నాయకుడు అయినటువంటి సురేంద్ర ప్రభుత్వ భూములపై కన్ను పడిందని ఓ పది రోజుల కిందట తహసిల్దార్ కార్యాలయం వెనుక జేసీబీ మిషనరీల సహాయంతో ఓ 5ఎకరాలు ఎవరి పర్మిషన్ లేకుండా ఆదివారం అధికారులకు సెలవని భావించి భూ కబ్జాలకు పాల్పడు తున్నారని, అధికారులను కూడా మేనేజ్ చేస్తున్నారని ఈ భూ కబ్జాలపై సంబంధిత తహసిల్దార్‌కి తెలియచేసినప్పటికీ రమాదేవి బోర్డులు పెట్టిస్తామని చెప్పడమే గాని.. బోర్డులు పెట్టిన దాకాలు అయితే లేవని.. అదే విధంగా నిన్నటికి నిన్న బుధవారం పెద్ద చెరువుకు సంబంధించి చెరువు పోరంబోకు ల్యాండ్‌ను స్థానిక నాయకుడు అయిన వరిగొండ సురేంద్ర ఇలాంటి కార్యక్రమాలని చేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కార్యకర్తలు కూడా ఈ నాయకుడు చేసే పనులు పట్ల ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మండల స్థాయి నాయకులు ఈ నాయకుడు చేసే పనులు పట్ల చర్యలు తీసుకుంటారని, అలాగే ఈ నాయకుడు ఏ పని చేసినా అందులో ఎమ్మెల్యే పేరు వాడుతున్నాడని, ఎమ్మెల్యే అండదండలతో చెలరేకపోతున్నాడని, ఇకనైనా సంబంధిత ఎమ్మెల్యే సైదాపురంలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని, అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు.

# జనవాణి తోనే సమస్యల పరిష్కారం

- ఇప్పటికే అనేక సమస్యల పరిష్కారం
- ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను దేశ ప్రజలు చత్రపతి శివాజీల భావిస్తున్నారు
- టిడ్కో చైర్మన్ వేములపాటి సూచన మేరకు జనవాణి కార్యక్రమం
- అర్జీలు స్వీకరించిన జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంతవరకు పరిష్కరిస్తున్నామని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. స్థానిక గోమతి నగర్‌లోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జనవాని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా టిడ్కో నివాసాల ప్రాంతంలో తలెత్తిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. వీటి వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను కోరారు. అర్హులైన పేదలందరికీ టిడ్కో గృహాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. జనవాణి కార్యక్రమాన్ని టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. పవన్ కళ్యాణ్‌ను ఒక చత్రపతి శివాజీలా భావిస్తున్నారని, ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక లేకపోతున్నాయి మండిపడ్డారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి ఘన విజయానికి పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేశారని ఈ విషయాన్ని దేశ ప్రధాని కూడా ఒప్పుకున్నారని గుర్తు చేశారు. అందుకే పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు వరం అని వ్యాఖ్యానించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ.. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె మల్లికార్జున యాదవ్, సుందర్ రామిరెడ్డి (స్టేట్ జాయింట్ సెక్రటరీ), జమీర్ (జిల్లా జనసేన పార్టీ ఆఫీస్ ఇంచార్జ్), వెంకటేశ్వరావు (డీఈఈ), కె.కృష్ణారెడ్డి, వై.రవికుమార్, గుత్తి శ్రీకాంత్ 8వ వార్డ్, శ్రీనివాసులు ముదిరాజ్ 10వ వార్డ్, మనోజ్ 9వ వార్డ్, పవన్ యాదవ్ 1వ వార్డ్, జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

# మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని గురువారం బస్టాండ్ సెంటర్లో గ్రామస్తులు నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఐటీడీపీ కన్వీనర్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం మాట్లాడుతూ.. ప్రశాంతతకు మారుపేరైన తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే వివాదాలకు అజ్యం పోసినట్లవుతోందన్నారు. ఇటు ఉదయగిరి, అటు వరికుంటపాడు మండలాల గ్రామాలకు అనువుగా గండిపాళెం గ్రామం ఉండడంతో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారస్తులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా గ్రామంలో త్వరలో మద్యం దుకాణం ఏర్పాటు చేయనున్నట్లు. ఫ్లెక్సీ సైతం ఏర్పాటు చేశారన్నారు. కూలినాలి చేసుకొని జీవనం సాగించే వారు మద్యం దుకాణం ఏర్పాటుతో మందుకు బానిసై కుటుంబం చిన్నాభిన్నమై ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఇటీవల ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు సైతం సమర్పించామన్నారు. గతంలో తమ గ్రామంలో ఉన్న మద్యం దుకాణాన్ని మూకుమ్మడిగా ఉద్యమాల, ఆందోళనలు చేపట్టి ఎత్తివేయించామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాట లను విరమించుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు షేక్ ఇమ్రాన్, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# దాడిలో మా ప్రమేయం లేదు

- మంత్రి నారాయణ పై విమర్శలు మానుకోవాలి
- టిడిపి నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మంత్రి పొంగూరు నారాయణ మీద విమర్శలు చేస్తే.. ఆకాశం మీద ఉమ్మేసిన్నట్టే అని టీడీపీ నగర అధ్యక్షురాలు రేవతి, విజయమ్మ అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కథలు అల్లడంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి సిద్ధహస్తులు అని.. అందులో భాగంగానే సాకేష్ పై టీడీపీ నేతలు దాడి చేసారని కట్టు కథలు చెబుతున్నారని మండిపడ్డారు. బంధువులు మధ్య జరిగిన గొడవ పార్టీలకు అంటకట్టడం దారుణం అన్నారు. వైసీపీ నేతల మీద దాడులు చేయించాల్సిన అవసరం తనకు లేదని.. ఆ సంస్కారం వైసీపీ నేతలకే ఉందంటూ రేవతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అక్రమ కేసులు పెట్టడం దాడులు చేయించడం వైసిపి సంస్కృతి అంటూ మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో బిజీగా ఉన్న మంత్రి నారాయణ పై కాకాని గోవర్ధన్ రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. మంత్రి నారాయణ మనస్తత్వం తెలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి.. విమర్శలు చేసేటప్పుడు ముందు వెనక ఆలోచించాలంటూ హితవు పలికారు. కార్యకర్తల సంక్షేమం కోసం, వాళ్ళింట్లో జరిగే శుభ అశుభ కార్యాలకు మంత్రి నారాయణ తన సొంత నిధులను వెచ్చిస్తున్నారని, అలాంటి గొప్ప మనసు ఎవరికైనా ఉంటుందా అని వారు ప్రశ్నించారు. మంత్రి పొంగూరు నారాయణ పై అవాకులు చవాకులు తెలిస్తే.. చూస్తూ ఊరుకోమని.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ హెచ్చరించారు.

## అయ్యప్పలకు అన్నదానం చేయటం మహాభాగ్యం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** దానాలన్నిటిలోనూ అన్న దానం మహా శ్రేష్టం. అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అందుకే అటువంటి అన్నాన్ని వృధా చేయకూడదు దానంగా ఎవరైనా ఏదైనా ఇస్తే ఇంకా కొంచెం ఇస్తే బాగుంటుందనుకుంటారు. చామదుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మునగాల తిరుమలరెడ్డి ఈ అన్నదాన కార్యక్రమంలో భాగం పంచుకున్నారు. అనంతరం మునగాల తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. మాల ధారణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియమాల దీక్ష చేస్తారు. ఉదయ అష్టమ సంధ్యలలో అయ్యప్ప స్వామి పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41 రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు. కఠిన నియమాలలో భిక్షకు, సద్దికి అధిక ప్రాధాన్యత ఉంది. దానిని ఎక్కడపడితే అక్కడ అయ్యప్పలు తీసుకోరాదు. అటువంటి అయ్యప్పలకు అన్నదానం చేయటం నా అదృష్టమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రామచంద్రారెడ్డి, రామిరెడ్డి, వాకా మహదేవరెడ్డి, బొచ్చు అనిల్ కుమార్ యాదవ్, వాకా హజరత్ రెడ్డి, తాటిరెడ్డి రఘురాం రెడ్డి, బాలయ్య, సేవా సమాజం కార్యనిర్వాహకులు బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీసు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస రాజుకు జిల్లా అదికారులు గురువారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. మండలంలో అభివృద్ధి పనులకు సహకరించకుండా ప్రతి పనికీ ముందుగానే పర్సంటేజిలు డిమాండ్ చేస్తున్నట్లు స్థానిక వైఎస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య ఇటీవలే జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ శాఖ ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించారు. విచారణ జరిపిన జిల్లా పంచాయతీరాజ్ అధికారులు విధి నిర్వహణలో ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించి మండలంలోని ఆయన పరిధిలో వున్న ఐదు పంచాయతీలను తప్పించి వింజమూరు ఏఈకి అదనపు బాధ్యతలు ఇచ్చారు. అంతేకాకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి గల కారణాలు తెలుపుతూ పదిరోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు చేపడతామని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

# అంటరానితనం, కుల వివక్ష లేని సమాజం కోసం కృషి

## మాజీ మంత్రి కాకాణి వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అంటరానితనం, కులవక్ష లేని సమాజం కోసం మహాత్మ జ్యోతిరావు పూలే పోరాటం చేసిన మహెూన్నత వ్యక్తిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలేకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే అంటరానితనం, కుల వివక్షలేని సమాజం కోసం జీవితకాలం పోరాడిన మహెూన్నత వ్యక్తి అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తిగా మహాత్మ జ్యోతిరావు పూలే చరిత్రలో నిలిచిపోయారు. మహిళలకు విద్యను అందించాలన్న మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల ముందు చూపుతో భారతదేశం మహిళా సాధికారత దిశగా అడుగులు వేసేందుకు అవకాశం కలిగిందన్నారు. రాష్ట్ర చరిత్రలో బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా నెలదొక్కుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంతోపాటు, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించిన ఘనత మన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. జగన్మోహన్‌రెడ్డి అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలు, మహిళల పురోగతికి తన ఐదేళ్ల పదవీకాలంలో అన్ని విధాలా అండగానిలిచారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన వసతులతో కూడిన విద్య, వైద్యం అందించడం విశేషం అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం జగనన్న ఆధ్వర్యంలో నిరంతరం పనిచేస్తామని తెలియజేసుకుంటూ, మహాత్మ జ్యోతిరావు పూలేకి ఘన నివాళులర్పిస్తున్నాం. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మనం విజయ్ కుమార్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

# ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలేంటి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆక్వా కల్చర్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. ముఖ్యంగా నెల్లూరులో ఎలాంటి కృషి చేస్తున్నారో వివరించాలన్నారు. ప్రతిపాదిత, లేదా నిర్మాణంలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ల సంఖ్య, వివరాలు, ప్రభుత్వం అందించిన నిధుల వివరాలు ఆరా తీశారు. ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల వివరాలు తెలియజేయాలని కోరారు. అలాగే ఇందుకోసం ప్రభుత్వం ఏదైనా ప్రచార కార్యక్రమాలు, ప్రచారాలను నిర్వహించిందా అని ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయమంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్లోని ఏలూరు, నెల్లూరు జిల్లాలతో సహా దేశ వ్యాప్తంగా ఆక్వాకల్చర్ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌ను పెంచడానికి, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన) అమలు చేస్తున్నామన్నారు. కోల్డ్ చైన్ కాంపోనెంట్ స్కీమ్ కింద, అర్హత ఉన్న ప్రాజెక్ట్ వ్యయంలో 35శాతం గ్రాంట్-ఇన్-ఎయిడ్‌గా అందించబడుతుందని వివరించారు. అలాగే క్లిష్టతరమైన ఎస్టీ, ఎస్సీలకు, స్వయం సహాయక సంఘాలకు 50శాతం గ్రాంట్-ఇన్-ఎయిడ్‌గా అందించబడుతుందని చెప్పారు. అత్యధికంగా 10 కోట్ల వరకు అందించబడుతుందని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ వాల్యూ చైన్ డెవలప్మెంట్ ప్రాజెక్ట కోసం, ఒక్కో ప్రాజెక్టు గరిష్టంగా 15 కోట్ల గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ ఉంటుందిబీ స్వతంత్ర పోస్ట్-హార్వెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట కోసం, ఒక్కో ప్రాజెక్టు గరిష్టంగా 10 కోట్ల గ్రాంట్-ఇన్-ఎయిడ్ ఉంటుందన్నారు. ఎఫ్‌పీఐల కోసం యొక్క ఏ కాంపోనెంట్ స్కీమ్ కింద రాష్ట్రాలవారీగా నిధులు కేటాయించలేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1186 మంది లబ్దిదారులకు గ్రాంట్- ఇన్-ఎయిడ్ కింద రూ.8560.62 కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 72 మంది లబ్దిదారులకు రూ.777.95 కోట్లు గ్రాంట్-ఇన్-ఎయిడ్‌గా అందించినట్లు చెప్పారు. అలాగే ఏలూరు జిల్లాలో 3యూనిట్లకు 20 కోట్లు, నెల్లూరులో 8 యూనిట్లకు 69.19 కోట్లు ఆమోదించినట్లు వివరించారు.

# పెంచలకోనలో చిరుత కలకలం

- అడవిలోకి వెళ్లిపోయిన చిరుత పులి
- భయపడవద్దు అంటున్న అటవీ అధికారులు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** పెంచలకోన సమీపంలో రోడ్డుపై బుధవారం రాత్రి చిరుతపులి దర్శనమిచ్చింది. కొందరు భక్తులు పెంచలకోన ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా అటవీశాఖ పార్కు సమీపంలోని రోడ్డుపై చిరుతపులి కనిపించింది. కారులో తిరిగి వస్తున్న భక్తులు భయంతో కేకలు వేస్తూ కారు హారన్ మోగించారు. రెండు నిముషాల పాటూ రోడ్డుపైనే ఉండిన చిరుత తర్వాత భక్తుల కేకలతో బెదిరి రోడ్డు దాటి అడవిలోకి పారిపోయింది. ఈ దృశ్యాలను కారులో ఉన్న హరీష్ అనే వ్యక్తి సెల్ ఫోన్‌లో చిత్రీకరించాడు. మరో వైపు పులి సంచారం విషయం తెలుసుకున్న జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా ఆ ప్రాంతంలోని అటవీ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీనిపై డిఎఫ్ఓ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. దేవస్థానం సమీపంలో గానీ, రోడ్డు చుట్టుపక్క ప్రాంతాల్లో ప్రస్తుతం పులి సంచారం లేదని స్పష్టం చేశారు. పులి అడవిలోకి వెళ్లిపోయిందని, భక్తులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. పెంచలకోన దేవస్థానంతో పాటూ దాని సమీప ప్రాంతాలు, అడవిలోని రహదారుల వెంట అటవీ శాఖ అధికారులు, సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉంటుందని డిఎఫ్ఓ మహబూబ్ బాషా తెలిపారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి




**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్బంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సంఘసంస్కర్తగా ఎన్నో సేవలు అందించారు అని అన్నారు. భారతదేశంలో మహిళా విద్యకు కృషిచేసి సమాజంలో అసమానతలపై, అంటరానితనంపై, అస్పృశ్యత, కుల వివక్షకు వ్యతిరేకంగా మహిళా సాధికారత కోసం పోరాటం చేసి సామాజిక సమానత్వానికి పునాది వేసిన సామాజికతత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, షేక్ రఫీ, మహర్షి శ్రీను, షేక్ రూబీ, కూనం నరేంద్ర, చుండూరి శ్రీనివాసులు, ముచ్చు వేణు, షేక్ సలాం, మోదడుగు వెంకటేశ్వర్లు, ముప్పవరపు వేణు, పసుపులేటి రమణయ్య, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వెంకటేశ్వర్లు నాదెండ్ల మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## బోలా శంకరుడికి భస్మాభిషేకం..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా పొద్దుట నుంచి స్వామివారికి దీపములు వెలిగించి స్వామి అమ్మ వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినారు. శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానం, మూలాపేట నందు కార్తీక మాసం సందర్భంగా గురువారం ఉ.10 గంటలకు శ్రీ స్వామి వారికి భస్మాభిషేకం జరిగింది. భక్తులు విశేషంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రదోష కాలంలో శ్రీ నందీశ్వరునికి, శ్రీ స్వామి వారికి ప్రదోషకాలం అభిషేకం నిర్వహించినారు. రాత్రి స్వామి అమ్మవారిని వెండి నంది వాహనంపై ఊరిగించారు. ఈ కార్యక్రమంకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మెప్మా అర్బన్ మార్కెట్లను ప్రోత్సహించండి

- అదనపు కమిషనర్ నందన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మహిళా సాధికారతే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే అర్బన్ మార్కెట్ స్టాళ్లను ప్రజలంతా సందర్శించి, వారిని ప్రోత్సహించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ ఆకాంక్షించారు. స్థానిక స్టోన్ హౌస్ పేట పప్పుల వీధిలో ఏర్పాటు చేసిన విక్రయ స్టాళ్లను అదనపు కమిషనర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధికై వినూత్న ఆలోచనలతో తయారు చేస్తున్న వివిధ రకాల గృహ అవసరమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రజలంతా వారి ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని కోరారు. స్టాళ్లలో ప్రతి ఒక్క ఇంటికీ అవసరమైన అన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని అదనపు కమిషనర్ తెలిపారు.

